క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబాజర్‌లలో వివిధ కూరగాయల ధరల వివరాలు ఇలా ఉన్నాయి. టమాటా (లోకల్) కిలో రూ. 15, (618 రకం) రూ. 15, వంకాయ రూ.23, బెండ రూ. 50, పచ్చిమిర్చి రూ. 35, కాకరకాయ రూ. 35, బీరకాయ రూ. 45, క్యాలీఫ్లవర్ రూ. 23, క్యాబేజీ రూ. 10, కారెట్ రూ. 21, దొండ రూ. 35, ఆలుగడ్డ రూ. 21, ఉల్లి రూ. 17, గోకర రూ. 40, దోస రూ. 23, సొరకాయ రూ. 15, పొట్లకాయ రూ. 18, అరటికాయ రూ. 9, చిక్కుడు రూ. 50, అర్వి రూ. 70, మునగ రూ. 95, చిలుకడ దుంప రూ. 33, బీట్‌రూట్ రూ. 15, కీర రూ. 23, బీన్స్ రూ. 45, క్యాప్సికమ్ రూ. 50 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వాన్ని సహించం

కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



కమలానగర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: పారిశుద్ధ్య పనుల నిర్వహణలో సిబ్బందికి అలసత్వం పనికిరాదని.. దీన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించమని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం మార్నింగ్‌వాక్‌లో భాగంగా ఆయన డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. వివిధ సమస్యలను కాలనీవాసులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందాచారి, కాలనీ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, శానిటేషన్ సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీపీకి శుభాకాంక్షలు



డీసీపీ సాయిశ్రీగౌడ్‌ను సన్మానిస్తున్న యాదగిరి

చంపాపేట: ఎల్బీనగర్ డీసీపీగా నియమితులైన సాయిశ్రీగౌడ్‌ను బుధవారం చంపాపేట డివిజన్ దుర్గానగర్ కాలనీకి చెందిన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ కార్యదర్శి కొండా యాదగిరి మర్యాదపూర్వకంగా కలసి పూలబొకే, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు అరుణ్, శ్యామ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ నాయకుల రాజీనామా



మాట్లాడుతున్న నేతలు

మన్సూరాబాద్: పార్టీ కేంద్ర కమిటీ అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ సీపీఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, గ్రేటర్ హైదరాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల కార్యదర్శులు ఆర్.సంతోష్, జాడి దేవరాజ్, వైకుంఠం, రమాదేవిలు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఎల్బీనగర్‌లోని బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... రాష్ట్ర కమిటీలో జరుగుతున్న పరిణామాలను కేంద్ర కమిటీ పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఆ పార్టీకి రాజీనామా చేసి సీపీఐ(ఎంఎల్) రెవల్యూషనరీ ఇనిషియేటివ్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ సభ్యుడు అన్వర్, బింగి సుధాకర్, నవీన్, శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో చోరీల నియంత్రణ

మీర్‌పేట: ప్రజల సహకారం ఉంటే దొంగతనాలు, చోరీలను నియంత్రించవచ్చని మీర్‌పేట 7వ డివిజన్ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప కోరారు. బుధవారం డివిజన్ పరిధి లక్ష్మీనగర్‌కాలనీ పార్కులో మీర్‌పేట పోలీసులు ప్రజలకు దొంగతనాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శివారు ప్రాంతాల్లో నూతనంగా వెలసిన కాలనీలను దృష్టిలో పెట్టుకుని పోలీసు వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సీసీ కెమెరాలతో దొంగతనాలను నివారించవచ్చని తెలిపారు. లక్ష్మీనగర్‌కాలనీ, ఆర్ఎన్‌రెడ్డినగర్ ప్రాంతాల్లో 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు కార్పొరేటర్ బీరప్ప తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఎస్ఐలు బద్యానాయక్, గోవిందస్వామి, బీఆర్ఎస్ నాయకులు దోమలపల్లి రాజ్‌కుమార్, కాలనీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి నరేష్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

మెట్ల బావులను అభివృద్ధి చేయరూ..!



సహారాస్టేట్స్ కాలనీ బహార్ బ్లాక్ వద్ద శిథిలావస్థలో ఉన్న మెట్లబావి

- పర్యాటక అభివృద్ధికి దోహదం
- పురాతన బావులకు సొబగులుద్దాలి
- పరిసర ప్రాంతాలూ అభివృద్ధి

మన్సూరాబాద్: శతాబ్దాల క్రితం నిర్మించిన మెట్ల బావులు ప్రస్తుతం అధ్వాన స్థితిలో ఉన్నాయి. వందల సంవత్సరాల క్రితం పూర్తిగా రాయితో సుందరంగా నిర్మించిన బావులు నాటి శోభను కోల్పోయి శిథిలావస్థలో ఉన్నాయి. మన్సూరాబాద్ డివిజన్ సహారా స్టేట్స్ కాలనీలో రెండు పురాతన మెట్ల బావులు ఉన్నాయి. అప్పట్లో సహారాకాలనీ ప్రాంతం దట్టమైన అడవి కావడంతో నాటి పాలకులు తాగునీటి అవసరార్థం మెట్లబావులను సుందరంగా నిర్మించారు.

- కాలనీలో కమ్యూనిటీ హాల్‌లో మెట్లబావిపైనే లలితా నాగలింగేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించారు. మరొకటి సహారా బహార్ 10వ బ్లాక్ వద్ద మరో అందమైన మెట్లబావి ఉంది.
- ప్రస్తుతం ఆ బావులు శిథిలావస్థకు చేరకున్నాయి. గతంలో స్వచ్ఛమైన తాగునీటిని అందజేసిన ఆ మెట్ల బావులు ప్రస్తుతం మురుగునీటితో నిండి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి.
- ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మెట్లబావులను అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా చేయాలి

నాటి పాలకులు ఎంతో సుందరంగా నిర్మించిన మెట్ల బావులు కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని పర్యాటకులను ఆకర్షించే విధంగా అన్నివిధాలా అభివృద్ధి చేయాలి. కాలనీలో రెండు మెట్ల బావులు ఉండటం మా అదృష్టంగా భావిస్తున్నాం. శుభ్రం చేసి అభివృద్ధి చేస్తే స్థానికంగా ఎంతో బాగుంటుంది.

– గంగదాసు కృష్ణారెడ్డి, సహారాస్టేట్స్‌కాలనీ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి



సహారాస్టేట్స్ కాలనీలోని లలితానాగలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న మెట్లబావి

చెరువులకు సొబగులు



మన్సూరాబాద్ పెద్దచెరువు సుందరీకరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

- అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నాం
- సీఎస్ఆర్ ఫండ్స్ కింద చెరువుల అభివృద్ధి
- మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద ఓపెన్ జిమ్
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ అత్యంత సుందరంగా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ పెద్దచెరువులో జరుగుతున్న సుందరీకరణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువుల సుందరీకరణ చేపట్టడం జరిగిందన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ కింద ప్రైవేటు సంస్థకు చెరువుల అభివృద్ధి పనులు అప్పగించామని వివరించారు.
- మన్సూరాబాద్ పెద్ద చెరువు చుట్టూ రెలింగ్ ఏర్పాటు చేయటమే కాకుండ వాకింగ్ ట్రాక్, యోగా కేంద్రం, పచ్చదనం ఉట్టిపడేలా లాన్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.
- పెద్దచెరువు ప్రాంగణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు చేయించి ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు.
- పెద్దచెరువు ప్రాంగణంలోని రెడ్డి శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.
- కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, సిద్దగోని జగదీష్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రాజిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎన్‌యూ యూనిట్‌లో డయాలసిస్ సేవల సామర్థ్యం పెంపు

సీనియర్ యూరాలజిస్టు డాక్టర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్, పక్కన డాక్టర్లు వలీ, శ్రీకాంత్

మలక్‌పేట: డయాలసిస్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆస్పత్రిలో యాభై శాతం సామర్థ్యాన్ని పెంపొందించినట్లు ఆస్పత్రి డైరెక్టర్, సీనియర్ యూరాలజిస్టు డాక్టర్ ఎన్.శ్రీనివాస్ తెలిపారు. రిటైర్డ్ జీహెచ్ఎంసీ అసిస్టెంట్ కమిషనర్, డయాలసిస్ పేషెంట్ పి.కృష్ణయ్య(82) చేతుల మీదుగా దిల్‌సుఖ్‌నగర్ యూనిట్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... అత్యాధునిక తరహా డయాలసిస్ పద్ధతి అయిన హెమోడయాఫిల్ట్రేషన్ (హెచ్‌డీఎఫ్) సేవలను అందించడానికి అవసరమైన సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం నెలకు 800 సెషన్లు చేస్తుండగా, ఇకపై ఏఐఎన్‌యూ యూనిట్‌లో నెలకు 1200 డయాలసిస్ సెషన్లు చేసే వీలు ఉందన్నారు. అత్యాధునిక టెక్నాలజీలను అందిపుచ్చుకోవడంలో ఏఐఎన్‌యూ ఎప్పుడూ ముందజలో ఉందన్నారు. కొత్త యూనిట్‌లో అత్యాధునిక హెచ్‌డీఎఫ్ చికిత్స అందిసున్నామని తెలిపారు. సమావేశంలో సీనియర్ నెఫ్రాలజిస్టు, డాక్టర్ పీఎస్ వలీ, డాక్టర్ శ్రీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ప్రత్యంగిరాదేవికి అన్నాభిషేకం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని ఆదిపరాశక్తి శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి వార్షిక బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ, మహానక్షత హారతి ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి అన్నాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 'వర్చువల్' ద్వారా భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా మహాస్వామి మాట్లాడుతూ... భారతీయ సనాతన ధర్మాలను కాపాడుకోవాలని సూచించారు. సనాతన ధర్మాలను, ఉపనిషత్తుల సారాంశాన్ని వివరించారు. ఆదిపరాశక్తి శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారి విశిష్టతను గుర్తించాలని సూచించారు. ప్రత్యేగిరా హోమాలు నిర్వహించారు. ఎల్బీనగర్ జోన్ పరిధిలో ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అంజిరెడ్డి, సీతారం, వెంకన్నలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు వారికి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ధర్మాధికారి శ్రీ వల్లూరు శివ కోటేశ్వర రాజు దంపతులు, హరీష్, విఠల్ శర్మ, సాయి కుమార్ శర్మ, అరుణ, హేమ, మూర్తి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అంజిరెడ్డి, సీతారాం, వెంకన్న, మధుసూదన్



ప్రత్యంగిరా అమ్మవారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

రక్తదానంతో ప్రాణదానం!

వనస్థలిపురం: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వనస్థలి క్రాంతి ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురం క్రాంతిహిల్స్ కాలనీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ లయన్ సాధు శ్యాంప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రక్తదానం ఎంతో మందికి ప్రాణదానం చేస్తుందని, యువకులు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా 20 మంది యువకులు, క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ డాక్టర్ మారంరాజు రామచంద్రరావు, కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ, కోశాధికారి నాగవరం మహేష్, ఉపాధ్యక్షులు జి.లోకారెడ్డి, సాధు కృష్ణకిషోర్, చైతన్య, ఇర్ఫాన్ అలీ, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారితో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తాగునీటి వృథాను సహించం

ఎల్బీనగర్: జలమండలి సిబ్బంది నిర్లక్ష్యంతోనే కాలనీలలో తరచూ తాగునీరు వృథాగా రోడ్లపై ప్రవహిస్తున్నాయని బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మెద్దు లచ్చిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన బీఎన్‌రెడ్డి నగర్ ఫేస్–1 కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కాలనీలో పాదయాత్ర నిర్వహించి రోడ్లపై వృథాగా ప్రవహిస్తున్న తాగునీటిని ఆయన పరిశీలించారు. వెంటనే స్పందించిన లచ్చిరెడ్డి వాటర్ వర్క్స్ సిబ్బందిని కాలనీకి రప్పించి లీక్ అవుతున్న పైపులను మరమ్మతు చేయించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ భవ్య, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పురుషోత్తంరెడ్డి, ధన్‌రాజ్, నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న కార్పొరేటర్ మెద్దు లచ్చిరెడ్డి

అంతర్గత రహదారులను సుందరంగా తీర్చిదిద్దుతాం

కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి



ఎస్‌బీహెచ్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: సైదాబాద్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలలోని అంతర్గత రహదారులను సైతం అన్నివిధాలా సుందరంగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి తెలిపారు. బుధవారం కార్పొరేటర్ ఎస్‌బీహెచ్ జీఏ–1 కాలనీలో తుదిదశలో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సైదాబాద్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో సెవరేజ్, వాటర్ పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో పనులు పూర్తయిన తరువాత అక్కడి రహదారులు ఆధునికీకరిస్తామని తెలిపారు. నేతలు రాజ్‌కుమార్, రామరాజు, నీరజ, నవాజ్ పాల్గొన్నారు.

విదేశీ వద్దు.. స్వదేశీ వస్తువులే ముద్దు



ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి

హస్తినాపురం: విదేశీ వస్తువులు వద్దు స్వదేశీ వస్తువులు ముద్దు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. కేవీ రమణాచారి 71వ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని ఎల్బీనగర్ జోన్ కర్మన్‌ఘాట్‌లోని స్థానిక ఉత్పత్తుల కేంద్రం చైర్మన్ భరత్ సంఘం ఆధ్వర్యంలో త్రివర్ణ దళాలు, ఆదర్శ రైతులు, కళాకారులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ డీసీపీ బత్తిని సాయిశ్రీ, వనస్థలిపురం, ఎల్బీనగర్ ఏసీపీలు పురుషోత్తంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మీర్‌పేట కమిషనర్ నాగేశ్వర్, ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, డీఐ సైదులు కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉప్పల ఫౌండేషన్

నాగోలు: పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఉప్పల ఫౌండేషన్ నిరంతరం చేయూతనందిస్తుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. నాగోలుకు చెందిన సుప్రియ, తట్టి అన్నారంకు చెందిన నిరుపేద కుటుంబంకు చెందిన వేదశ్రీ వివాహం సందర్భంగా బుధవారం నాగోలులో ఉప్పల శ్రీనివాస్ కార్యాలయంలో కలవగా వారికి ఉప్పల శ్రీనివాస్ గుప్తా చేతుల మీదగా మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్లకు పుస్తె, మెట్టెలు నిరంతరం అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెళ్లికూతుర్లు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, నాగరాజు, సందీప్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



పుస్తె, మెట్టెలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

సంక్షేమ పథకాల అమలు ఘనత సీఎం కేసీఆర్‌దే

హస్తినాపురం: పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాలు అణగారిన ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రంలో అనేక పథకాలు ప్రవేశ పెట్టి వాటిని పకడ్బందీగా అమలు పరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. బుధవారం నందనవనం కాలనీలో స్థానికులతో కలిసి కార్పొరేటర్ సుజాతానాయక్ మార్నింగ్ వాక్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలైన షాదిముబారక్, కళ్యాణ లక్ష్మీ, వృద్ధాప్య, వితంతు పింఛన్లతోపాటు దళిత బంధు పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు పరుస్తుందని అన్నారు. ఈనెల 11న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సుజాతనాయక్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మహిళా విభాగం డివిజన్ అధ్యక్షురాలు బోయ ఆదిలక్ష్మీ, యువజన విభాగం అధ్యక్షుడు విజయ్, హనుమాన్ టెంపుల్ డైరక్టర్ అనిత, సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నందనవనంకాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

'కృష్ణవేణి'లో ఉచిత వైద్య శిబిరం

మీర్‌పేట: నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చైర్మన్ షరీఫ్ తెలిపారు. మీర్‌పేట ఆర్ఎన్‌రెడ్డి నగర్‌లోని పాఠశాలలో బుధవారం గ్లోబల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు జ్యోత్స్న, లక్ష్మీ, శాంతిప్రియ, శ్రీనిధి.. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇచ్చారు. పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, ప్రెసిడెంట్ జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్ పేలి అగ్నిప్రమాదం

చాదర్‌ఘాట్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గ్యాస్ సిలిండర్ పేలి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలివీ... ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ వాహెద్‌నగర్‌లో రిటైర్డ్ ఉద్యోగి అబ్దుల్ ఖాదీర్ ఇంట్లో బుధవారం ఉదయం గ్యాస్ సిలిండర్ పేలి ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్‌లతో అక్కడికి చేరుకొని మంటలు ఆర్పారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిపోయింది. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, చాదర్‌ఘాట్ పోలీసులు, ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు షఫీయుద్దీన్ అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.



ఇంట్లో చెలరేగుతున్న మంటలు